నమస్తే తెలంగాణ

ములుగు జయశంకర్ భూపాలపల్లి

5 | వరంగల్, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

సిల్వర్ జూబ్లీ వేడుకలకు సిద్ధం



బీఆర్ఎస్ రజతోత్సవం కోసం ఎల్కతుర్తిలో బహిరంగ సభా వేదిక సిద్ధమవుతోంది. ఇప్పటికే మైదానాన్ని చదును చేసి బారికేడ్లు ఏర్పాటుచేశారు. సాయంత్రం వేళ సభ నిర్వహించనున్న సెంట్రల్ లైటింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రౌండ్‌లో 25 ఏండ్ల పండుగను ప్రస్ఫుటించేలా సిల్వర్ కలర్‌లో రూపొందించిన ఆకృతి, జెండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ శ్రేణులతో ఎమ్మెల్సీ కవిత
- చల్వాయి, ములుగులో ఘన స్వాగతం

గోవిందరావుపేట : చల్వాయిలో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న మహిళలు

గోవిందరావుపేట/ములుగు రూరల్, ఏప్రిల్ 21 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. సోమవారం భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని జాతీయ రహదారిపై ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాల్చి ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మంగళహారతులతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ.. కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి.. మళ్లీ కాబోయే సీఎం కేసీఆర్ అని నినాదాలు చేస్తుండటంతో ఎమ్మెల్సీ కవిత సైతం వారితో నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నారని, ఎక్కడికి వెళ్లిన కేసీఆర్‌ను దేవుడిగా కొలుచుకుంటున్నారని అన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో నాయకులు పోరిక గోవింద్‌నాయక్, పోరిక విజయ్‌రామ్‌నాయక్, కోగిల మహేశ్, గునిగంటి హరీశ్, నాజర్‌ఖాన్, హరిలాల్, గునిగంటి హరీశ్ తదితరులు కవితకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

సభావేదిక పైనుంచి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం , వొడితెల తదితరులు

దగాపడ్డ అన్ని వర్గాల ప్రజలు సభకు వస్తున్నరు..

దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దగాపడ్డ ప్రతి ఒక్కరు వస్తారు. 25 ఏండ్లలో అనేక ఉద్యమాలు, సుపరిపాలన అందించిన ఘనత కేసీఆర్‌దే. పాతికేళ్ల సంబురాన్ని రజతోత్సవ సభగా కేసీఆర్ ఆదేశాల మేరకు జరుపుతున్నాం. కనీవినీ ఎరగని రీతిలో ఈ సభ ఉంటుంది. కేసీఆర్ ప్రసంగం వినేందుకు యావత్ దేశం ఎదురు చూస్తున్నది. అంచనాకు మించి జనం వస్తారు, వారందరికీ అన్ని సదుపాయాలు కల్పిస్తాం. 20 రోజులుగా ఉమ్మడి జిల్లా నాయకత్వంతో కలిసి రేయింబవళ్లు పనిచేస్తున్నాం. రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములివ్వడం అభినందనీయం. ఎండాకాలం కనుక చల్లని నీళ్లు, మజ్జిగ అందజేస్తున్నాం. రిటైర్డ్ పోలీసు అధికారుల ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది వలంటీర్లు సేవలనందిస్తారు. వైద్య సదుపాయం కూడా కల్పిస్తున్నాం.

సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

పదవులు లెక్కచేయనిది కేసీఆర్ ఒక్కరే..

హామీల పేరుతో అన్ని వర్గాలకు కాంగ్రెస్ మోసం

- రాష్ట్రంలో మళ్లీ 2014 ముందు పరిస్థితులు
- తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకోరు
- ప్రజలకు అన్నీ వివరించేందుకే 27న ఎల్కతుర్తి సభ
- మేం రజతోత్సవం అంటే.. ప్రజలు తిరుగుబాటు సభ అంటున్నరు
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 : ప్రత్యేక రాష్ట్ర సాధనలో కేసీఆర్ ఎన్నో త్యాగాలు చేశారని, కేంద్ర మంత్రి పదవిని సైతం లెక్కచేయకుండా రాజీనామా చేశారని తెలంగాణ కోసం ఆయన చేసినన్ని రాజీనామాలు దేశంలో మరే నాయకుడూ చేయలేదని మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడి, ప్రాణాలకు తెగించి సాధించుకున్న రాష్ట్రానికి మళ్లీ అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకోరని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ నా యకత్వంలో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దారని, జీఎస్టీలో దేశంలో 3వ స్థానానికి తీసుకెళ్లారని, వృద్ధి రేటులో అగ్రభాగానికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. రాష్ట్రం సిద్ధించిన తర్వాత వెనకబడి ఉన్న తెలంగాణను కేసీఆర్ ప్రగ తి పథంలోకి తీసుకెళ్లారని, కానీ ఇప్పుడున్న ఈ ప్రభుత్వం ఎక్కడికి తీసుకెళ్తుందో గమనించాలన్నారు. నేడు అన్నీ పడిపోయి, రాష్ట్రాన్ని దిగజార్చారని పేర్కొన్నారు. హామీల పేరుతో అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభు త్వం మోసం చేసిందని, ముఖ్యంగా రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు తమ డబ్బులు తమకు ఇవ్వాలని అడిగినా ఇవ్వడం లేదని, నమ్మి మోసపోయామని ఉద్యోగులు సైతం చెబుతున్నారని, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను జోక్‌గా చేశారని మండిపడ్డారు. ఇచ్చిన ఒక్క హామీనీ నెరవేర్చక, అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ దగా చేసిందన్నారు. నీళ్లు లేక, కరంటు రాక మళ్లీ రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని, గ్రామాలు, పట్టణాల్లో నీళ్లు లేక బోరు బావుల దగ్గర గొడవలు మొదలయ్యే పరిస్థితికి తీసుకొచ్చారని తెలిపారు. కసితో, కక్షతో కాళేశ్వరం నీళ్లు లిఫ్ట్ చేయడం లేదని, ఒకవేళ చేస్తే అంత బాగానే ఉందని, తామే అబద్ధాలు చెప్పామని ప్రజలు భావిస్తారని ప్రాజెక్టును ఎండబెట్టారని.. దేవాదుల కరంటు బిల్లులు కట్టకుండా ఎండగొట్టారని ఆరోపించారు. ప్రజలు తమకు జరుగుతున్న మోసాలు, అన్యాయాలను తట్టుకోలేక ప్రభుత్వాలపై తిరుగుబాటు చేస్తారని, శ్రీలంకలో దాడులు చేసి ప్రభుత్వాన్ని మార్చారని, మరో దేశంలో కూడా తిరుగుబాటు చేశారని గుర్తుచేశారు. కానీ మనది ప్రజాస్వామ్య దేశమని, తమ కోపాన్ని కూడా ప్రభుత్వానికి కసితో చూపించాలనే ఈ సభకు ప్రజలు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు వివరించారు. ఏడాదిన్నర ప్రభుత్వానికి కేసీఆర్ సమయం ఇచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యల పరిష్కారం కంటే కుట్రలు, కుతంత్రాలనే నమ్ముకున్నదని విమర్శించారు. ఇంకా ఇలాగే ఉంటే ఇంకా తెలంగాణను నాశనం చేస్తారనే ప్రజలకు అన్నీ వివరించేందుకే ఈ సభ నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆగమవుతున్న తెలంగాణను కాపాడుకునే బాధ్యత రాష్ట్రం తెచ్చిన నాయకుడిగా కేసీఆర్‌కు ఉన్నదని, అందుకే ప్రజలను జాగృతం చేసేందుకే సభ నిర్వహిస్తున్నామని వివరించారు. దేశంలో కేసీఆర్ వలె బహిరంగ సభలు ఎవరూ పెట్టలేదని, గతంలో వరంగల్‌లో 10లక్షల మందితో సభ నిర్వహించామని గుర్తుచేశారు. తాము రజతోత్సవ సభ అంటే ప్రజలు మాత్రం ప్రభుత్వంపై తిరుగుబాటు సభగా మార్చుకున్నారని వివరించారు. ఏప్రిల్ 27 ఎప్పుడు వస్తదా అని, కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని ప్రజలే కాకుండా దేశ ప్రజలు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, వొడితెల సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు లింగంపల్లి కిషన్‌రావు, నాగుర్ల వెంకన్న, వాసుదేవారెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి, నాయకులు చింతం సదానందం, కడారి రాజు, గొల్లె మహేందర్, ఎల్తూరి స్వామి, తంగెడ నగేశ్, తంగెడ మహేందర్, దుగ్యాని సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సభకు అన్ని వర్గాల సహకారం

- పండుగ వాతావరణంలో రజతోత్సవం
- నేడు ఏర్పాట్ల పరిశీలనకు రానున్న కేటీఆర్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎమ్మెల్సీ పోచంపల్లితో కలిసి పనుల పరిశీలన

బీఆర్ఎస్ ప్రజల పార్టీ

బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ. రజతోత్సవ సభ బ్రహ్మాండంగా జరుగుతుంది. 165 ఎకరాల్లో సభా ప్రాంగణం పనులు పూర్తి కావచ్చాయని, పార్కింగ్‌కు సిద్దిపేట-కరీంనగర్-వరంగల్ రూట్లలో ఏర్పాట్లు చేశాం. ఒకరిద్దరు కాంగ్రెస్ నాయకులు ఈర్ష్యతో విమర్శలు చేస్తున్నారు. అయితే సభకు రైతులందరు ముందుకొచ్చి సహకరిస్తున్నారు. ఈ సభ ఎవరికి వ్యతిరేకంగా, విమర్శల కోసం నిర్వహించడం లేదు. ఇది 14 ఏండ్లు కొట్లాడి, పదేండ్లు స్వర్ణయుగం లాంటి పాలన అందించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ.

– పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న సభకు అన్ని వర్గాలు సహకరిస్తున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడించారు. రజతోత్సవ బహిరంగ సభ పండుగ వాతావరణంలో జరుగుతుందన్నారు. సోమవారం సభా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తల సన్నాహక సమావేశాలు ముగిశాయని, ప్రజలు స్వచ్ఛంధంగా తరలివచ్చేందుకు ఉ త్సాహంగా ఉన్నారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా లో అనుకున్న దానికంటే అధికంగా లక్షలాదిగా ప్రజ లు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని, రైతులు, ప్రజలకు ఎ లాంటి ఇబ్బంది లేదన్నారు. ఒకరిద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజకీయాల కోసం ఏదో చేస్తున్నారని, దానిని ప్రజలే తిరస్కరిస్తారన్నారు. సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే కాకుండా ప్రజలు, విద్యార్థులు, ఉద్యమకారులు, అభిమానులు వచ్చేందుకు సిద్ధమయ్యారన్నారు. కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన మాటలు వినేందుకు ప్రజలంతా ఎదురు చూస్తున్నారని వెల్లడించారు. ఈ నెల 22 (మంగళవారం)న పనులు సభా స్థలిలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని తెలిపారు. అలాగే నియోజకవర్గాల నుంచి నాయకులు వచ్చి తమకు కేటాయించిన పార్కింగ్ స్థలాలను చూసుకొని వెళ్లాలని చెప్పినట్లు ఎర్రబెల్లి తెలిపారు. వారి వెంట కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకన్న, వాసుదేవరెడ్డి, వరంగల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం తదితరులున్నారు.

గులాబీ జాతరకు లక్షలాదిగా తరలిరావాలి

- ప్రజల సమాచారం కోసం ప్రత్యేక కాల్ సెంటర్
- అన్ని నియోజకవర్గ నాయకులకు రూట్ మ్యాప్‌లు
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట, ఏప్రిల్ 21 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న గులాబీ జాతరకు ఇంటికొక్కరు చొప్పున లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నర్సంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు గులాబీ జెండా ఎల్లప్పుడు అండగా ఉంటుందని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రైతులకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా చితికిపోయిందన్నారు. వ్యవసాయం అంటేనే కేసీఆర్ అని, అన్నదాతను ఆదుకున్న మహానుభావుడన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభిస్తామని 16 నెలలుగా చెబుతున్నారని, ఇప్పటి వరకు ఎక్కడా కూడా పునాది తీసిన దాఖలాలు లేవన్నారు. ఆ పార్టీ నాయకులు కేవలం ఫొటోలకే పరిమితమయ్యారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో పంట నష్టం జరిగితే జిల్లా ఇన్‌చార్జి మంత్రికి, స్థానిక ఎమ్మెల్యేకు ఏమాత్రం సోయిలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రైతులకు నష్టం జరిగితే స్వయంగా మాజీ సీఎం కేసీఆర్ వచ్చి పరిశీలించి బాధిత రైతులకు భరోసా కల్పించారన్నారు. పంటలు నష్టపోతే అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి రజతోత్సవ సభకు 26 వేల మంది తరలిరానున్నారని తెలిపారు. వారి కోసం ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, డీసీఎంలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. 1200 భారీ వాహనాల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు, రైతులు తరలివస్తారని పెద్ది తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభా వేదిక, పార్కింగ్ స్థలాల రూట్‌మ్యాప్‌ను అన్ని నియోజకవర్గాల నాయకులకు అందజేస్తున్నామన్నారు. ఎక్కడా ట్రాఫిక్ జామ్ కాకుండా అనేక దారులను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. సభకు వచ్చే ప్రజల సమాచారం కోసం ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పెద్ది చెప్పారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామినాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఖానాపురం మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, మాజీ జడ్పీటీసీ బాలు, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, దేవోజు సదానందం, బండి ప్రవీణ్, నాగిశెట్టి ప్రసాద్, శివరాత్రి స్వామి, వెంకటేశ్వర్లు, నాయకులు పైస ప్రవీణ్‌కుమార్, నాయిని వేణుచంద్, దేవోజు హేమంత్, భీరం అనంతరెడ్డి, నల్లా రవీందర్ ఉన్నారు.

చిట్యాల : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

సంక్షేమంలో దేశానికే కేసీఆర్ ఆదర్శం

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్/చిట్యాల, ఏప్రిల్ 21 : పదేండ్ల పాటు సుపరిపాలన కొనసాగించిన నాటి సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా నిలిచారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కొనియాడారు. అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సోమవారం భూపాలపల్లి మండలం మోరంచపల్లి, ఎస్ఎం కొత్తపల్లి, శ్యామ్‌నగర్, చిట్యాల మండలం దూత్‌పల్లి, లక్ష్మీపూర్‌తండా, ఒడితల, పాసిగడ్డతండా, గోపాలపూర్, కొత్తపేట, జడలపేట, నైన్‌పాక, వరికోల్‌పల్లి, చైన్‌పాక, అందుకుతండా, వెంచరామి, గిద్దెముత్తారం, కాల్వపల్లి గ్రామాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఒక్కో గ్రామం నుంచి 100 మందికి తగ్గకుండా హాజరై విజయవంతం చేయాలని శ్రేణులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ నెల 27న అన్ని గ్రామాల్లో శ్రేణులు పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ప్రజలతో కలిసి సభకు బయలుదేరాలన్నారు. సమావేశాల్లో భూపాలపల్లి మాజీ ఎంపీపీ కల్లెపు రఘుపతిరావు, నేతలు వేణుగోపాల్‌రెడ్డి, సదానందం, చిట్యాల మండల పార్టీ అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్‌రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేశ్, మండల ప్రధాన కార్యదర్శులు ఏరుకొండ రాజేందర్, మడికొండ రవీందర్ రావు, మండల యూత్ అధ్యక్షుడు టీ నవీన్, కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు టీ తిరుపతి, నాయకులు కాట్రేవుల కుమార్, హరిభూషణ్, నిమ్మగడ్డ రాంబాబు, ఐలయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

రైతుల అనుమతితోనే రజతోత్సవ సభ

- అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది రానివ్వం
- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 21 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, చింతలపల్లి గ్రామాల రైతుల సహకారం, వారి అనుమతితోనే బీఆర్ఎస్ రజతోత్సవ సభను ని ర్వహిస్తున్నామని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ వెల్లడించారు. సోమవారం సభా ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సోమవారం ఈ ప్రాం తానికి వచ్చి కాల్వలు పూడ్చివేస్తున్నారని, రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. రైతులతో మాట్లాడిన తర్వాతే 1200 ఎకరా ల స్థలాన్ని తీసుకొని, వారి సమక్షంలోనే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వేదిక వద్ద పోస్తున్న రెడీమిక్స్‌ను సభ ముగిసిన తర్వాత తీసేసి యథాతథంగా రైతులకు అప్పగిస్తామన్నారు. సభకు ప్రజలు నడుచుకుంటూ వచ్చేలా కొన్ని ప్రాంతాల్లో మోసిన మొ రాన్ని కూడా తీసేస్తామన్నారు. ఏ ఒక్క రైతు నుంచి ఇబ్బంది తలెత్తలేదని, తాను స్థానికంగా ఉంటానని, వారి బాగోగులు తానే చూసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నడవడానికి కాల్వల వద్ద పోసిన మొరాన్ని సభ అనంతరం తొలగిస్తామన్నారు. భూముల హద్దులు చెరిపేసినట్లు ఆరోపించారని, ముందుగానే సర్వేయర్‌తో హద్దులు తీసుకున్నామని, తర్వాత వాటిని యధావిధిగా పెడతామని హామీ ఇచ్చారు. సభకు అన్ని పార్టీలు, ప్రజలు, రైతుల సహకారం ఉందని, ఎవరికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటామని సతీశ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు తంగెడ మహేందర్, తంగెడ నగేశ్, గొల్లె మహేందర్, ఎల్తూరి స్వామి, మదన్‌మోహన్‌రావు, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మంతుర్తి కొంరయ్య, జూపాక జడ్సన్, సాతూరి శంకర్ పాల్గొన్నారు.

దండులా కదిలిరావాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 21 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు దండులా కదిలిరావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండల అబ్జర్వర్, మాజీ రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు ఎర్రి రమణారెడ్డి అన్నారు. సోమవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేశ్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి మండల అబ్జర్వర్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గులాబీ పండుగను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మారపాక రవి, కూడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, కనకం గణేశ్, గుండె రంజిత్, చిట్టిబాబు, నాయకులు కట్ల రాజు, సాంబరాజు, అశోక్, జేమ్స్, యాదగిరి, ఎల్లయ్య, రాములు, శేఖర్ పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 21: ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాలికకు మాయ మాటలు చెప్పి శారీరకంగా లోబర్చుకున్న హాస్టల్ వాచ్‌మెన్‌కు 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ హనుమకొండ అదనపు జిల్లా జడ్జి అపర్ణాదేవి సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. హనుమకొండలోని వడ్డేపల్లి చర్చి సమీపంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో తల్లిని కోల్పోయిన బాలిక 7వ తరగతి చదువుకునేది. అదే పాఠశాలలోవాచ్‌మెన్‌గా ఉండే ఘనపురం మండలం రవినగర్‌కు చెందిన నిందితుడు ఆకుల సాంబ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి వేములవాడ తీసుకు వెళ్లి అక్కడి సత్రంలో పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. చివరికి జరిగిన మోసం గ్రహించిన సదరు బాలిక సీతంపేటలోని తన మామకు విషయం తెలుపగా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి కాజీపేట ఏసీపీ రవీంద్రకుమార్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షుల్ని విచారించిన న్యాయమూర్తి అపర్ణాదేవి నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలుతో పాటు రూ. 20 వేల జరిమానా విధించారు. బాలిక భవిష్యత్ కోసం రూ. నాలుగు లక్షల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం ద్వారా ఇప్పించాలని న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి వాదించగా కోర్ట్ డ్యూటీ హెడ్ కానిస్టేబుల్ వలబోజు రవీందర్ సాక్షులను ప్రవేశ పెట్టారు.

ముస్లింలకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి సత్యవతి, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలి

మానుకోటలో ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 21 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకు వచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌తో పాటు ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా, కుల సంఘాల నాయకులు మద్దతు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ బిల్లు వల్ల ముస్లింలకు రక్షణ లేకుండా వారి ఆస్తులను హరించే విధంగా ఉందని, వెంటనే ఈ బిల్లును రద్దు చేయాలని ముస్లిం ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లిం పరిరక్షణ కమిటీ ఐక్య వేదిక నాయకుడు ఇక్బాల్, ఎండీ ఫరీద్, ఖలీల్, యూసుఫ్, మదార్, షేక్ ఖాదర్ బాబా, యాకుబ్, ఇమ్రాన్, అబ్దుల్ పాల్గొన్నారు.